అనుగ్రహించు ఆదిదేవా..


నేమాం గ్రామంలోని అతి పురాతన శివాలయంలో ఉమా రామలింగేశ్వరస్వామి


నేమాం శివాలయంలో పర్వత వర్ధినీ అమ్మవారు


పర్వత వర్ధినీ సమేత ఉమా రామలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

- మహా శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం
- భక్తుల దర్శనాలకు ఏర్పాట్లు చేసిన అధికారులు

కాకినాడ రూరల్: మహా శివరాత్రి పూజలకు, అభిషేకాలకు నియోజకవర్గంలోని శైవాలయాలు సిద్ధమయ్యాయి. బుధవారం శివరాత్రి దర్శనాల కోసం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేమాంలో అతి పురాతన దేవాలయం

సాగర తీర గ్రామం నేమాంలో అతిపురాతన శివాలయం ఉంది. పశ్చిమ ముఖ ద్వారంతో ఉన్న ఈ ఆలయంలో పర్వత వర్ధిని సమేత ఉమా రామలింగేశ్వరుడు కొలువై ఉన్నాడు. పూర్వం గ్రామ పరిధిలో 101 ఆలయాలు, 101 కోనేరులు ఉండేవని ప్రతీతి. కాలక్రమేణ అవి కనుమరయ్యాయని, ప్రస్తుతం ఉన్న శివాలయంలో స్వామికి మహా శివరాత్రితో పాటు ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున స్వామి వారి దర్శనానికి తరలివచ్చి స్వయం భూ శివలింగాన్ని దర్శించుకుంటారు. నేమాంతో పాటు సమీపంలో సూర్యారావు శివాయలం వద్ద శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. రెండు చోట్ల భక్తులు అధిక సంఖ్యలో సముద్ర స్నానాలు ఆచరిస్తారు. నేమాం శివాలయంలో సోమవారం రాత్రి ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలయజేశారు. మండలంలోని పండూరు, తిమ్మాపురం, రమణయ్యపేట గోకుల్ గార్డెన్, ఆర్టీసీ కాలనీ, సర్పవరం, తూరంగి, కొవ్వాడ, తదితర గ్రామాలలో శివాలయాలు శివరాత్రి రోజున బుధవారం దర్శనాలకు వచ్చే భక్తులకు అధికారులు గ్రామస్తులు, అధికారులు ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నిక సామగ్రి పంపిణీ ఏర్పాట్ల పరిశీలన


కాకినాడ మెక్లారిన్ హైస్కూల్‌లో పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి కాకినాడ మెక్లారిన్ హైస్కూల్‌లోని పోలింగ్ మెటీరియల్‌ను ఆర్డీవో సాతులూరి మల్లిబాబు మంగళవారం పరిశీలించారు. గురువారం జరగనున్న ఎన్నికకు పోలింగ్ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ కాకినాడ డివిజన్‌లో 67 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 14 రూట్లుగా విభజించి, పోలింగ్ మెటీరియల్ పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. కాకినాడ డివిజన్‌లో సుమారు 50 వేల మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారన్నారు. ఈ పంపిణీ ఏర్పాట్ల పరిశీలనలో ఆర్డీవో మల్లిబాబుతో తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ గోవిందరాజులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, మాచారపు కృష్ణకుమారి, తదితరులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తూరంగి ఎస్సీ, ఎస్టీ పీపుల్స్ సంక్షేమ సంఘం ఎన్నిక

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి ఎస్సీ, ఎస్టీ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం మంగళవారం సాయంత్రం తూరంగి బొడ్డు చెరువు ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం నూతన కార్యవర్గాన్ని అధ్యక్ష, కార్యదర్శులు సబ్బతి ఫణీశ్వరరావు, జగడం అప్పారావుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సీహెచ్ కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా పినిపే బాబులు, ఉపాధ్యక్షులుగా ఎ.శ్రీనివాస్‌సాగర్, కోశాధికారిగా టి.నూకరాజు, కార్యదర్శిగా దడాల వీరప్రసాద్, బల్ల జేమ్స్, కార్యదర్శిగా ఉండ్రు రాంప్రసాద్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే సంఘం భవనాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సంఘం సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బి.శ్రీనివాసరావు, శెట్టిబత్తుల ఉదయ్‌శంకర్, గెద్దం శరత్‌బాబు, కుంటే సత్యనారాయణ, కాండ్రు రాజ్‌కుమార్, సిద్దాంతపు రాజు, గోడి జగన్, నల్ల వెంకటరమణ, జగడం కిరణ్ తదితరులు ఎన్నికయ్యారు.

చిట్టియ్యకు ఘన నివాళి


చిట్టియ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ఉపాధ్యాయ సంఘం ఉద్యమ నేత గుండాపు చిట్టియ్య వర్ధంతిని మంగళవారం తూరంగిలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు జోగా అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జోగా అప్పారావు, సీపీఎం నాయకులు సీహెచ్ అజయ్‌కుమార్, కె.వీరబాబు, దాసరి సత్తిబాబు గుండాపు స్వర్ణలత తదితరులు పాల్గొని చిట్టియ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోగా అప్పారావు మాట్లాడుతూ కాకినాడ సిటీలో యూటీఎఫ్ నిర్మాణానికి ఆయన విశేష కృషి చేశారని, ఎయిడెడ్ టీచర్ల పోరాటానికి సహాయ, సహకారాలు అందించారన్నారు. జీవితం చివరి వరకు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జీవించారని వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.లిఖిత, మణికంఠ, కె.విష్ణు, రమేష్, కె.మహేష్ పాల్గొన్నారు.

ఇంద్రపాలెంలో కార్డన్ సెర్చ్


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని తూరంగి మహాలక్ష్మినగర్, పగడాల పేట, ప్రతాప్ నగర్ ప్రాంతాలలో పోలీసులు కార్డన్ సర్చ్ ఆపరేషన్‌ను మంగళవారం తెల్లవారు జామున నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ చైతన్య కృష్ణ, ట్రైనీ ఏఎస్పీ సుష్మిత, ఇంద్రపాలెం, కోరంగి, ఎస్సైలు వీరబాబు, సత్యనారాయణ, ప్రసాద్, సూర్యకుమార్ తదితరులు వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 20 మోటారు సైకిళ్లను గుర్తించి ఇంద్రపాలెం పీఎస్‌కు తరలించారు.

పాడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా చైత్ర వర్షిణి

పిఠాపురం: పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా చైత్ర వర్షిణిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ఇప్పటి వరకు పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేషీలో ఓఎస్డీగా పని చేస్తున్నారు.

ఫార్మారంగంలో ఉపాధి అవకాశాలు మెండు

ట్రిపుల్ ఐ పీటీ డైరెక్టర్ జీటీ కృష్ణ


క్యాంపస్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఐఐపీటీ డైరెక్టర్ జీటీ కృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే కళాశాలతో పాటు అనుబంధ కళాశాల విద్యార్థులకు పట్టాతో పాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఐఐఐపీటీ (ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్) డైరెక్టర్ బీటీ కృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో మంగళవారం దివీస్ సంస్థ మెకానికల్, కెమికల్, బీ ఫార్మశీ, ఎం ఫార్మశీ అభ్యర్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫార్మశీ రంగంలో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం తగిన విధంగా ఉపయోగించుకుని పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలన్నారు. ఇంటర్వ్యూలకు 110 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 60 మంది హాజరయ్యారు. అనంతరం సంస్థ ప్రతినిధులు వర్సిటీ వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ శరత్, రామకృష్ణ, డైరెక్టర్ పద్మప్రియ, ఫార్మశీ విభాగాధిపతి భవాని పాల్గొన్నారు.

గ్రూప్–2 విద్యార్థులకు అండగా ఉంటా

ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): గ్రూప్–2 నోటిఫికేషన్ రోస్టర్‌లో అనేక లోపాలు ఉన్నాయని చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఏపీపీఎస్సీని బలిపశువును చేసి పరీక్షలు నిర్వహించిందని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ అన్నారు. ఈ నోటిఫికేషన్ ద్వారా మోసపోయిన నిరుద్యోగ యువతకు తాను అండగా ఉంటానని, నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష రద్దు కోరుతూ 2 వేల మంది విద్యార్థులతో రిట్ పిటిషన్ వేయిస్తున్నామన్నారు. కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో గ్రూప్–2 పరీక్షలో మోసపోయిన విద్యార్థులతో మంగళవారం సదస్సు నిర్వహించారు. గ్రూప్–2 పరీక్షల నోటిఫికేషన్లు లోపాలు సరిదిద్దకుండా పరీక్షలు నిర్వహించడంపై రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది విద్యార్థులు ఈ పరీక్షల వల్ల మోసపోయారని, వీరందరికీ చివరి వరకు తాను అండగా ఉంటానన్నారు. ఈ నోటిఫికేషన్ పైనా, నిర్వహించిన పరీక్ష రద్దు కోసం 2 వేల మంది విద్యార్థులు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడతానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలుత విశాఖపట్నం, ఆ తర్వాత విజయవాడలలో సదస్సులు నిర్వహించి పోరాటం చేస్తానన్నారు.

ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా?

జీజీహెచ్ వార్డుల్లో సూపరింటెండెంట్ ఆరా


ఆస్పత్రిలో తనకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న బాలింత

కాకినాడ క్రైం: మీకు అందిస్తున్న సేవలకు ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా? అలా అడిగితే తక్షణమే వారిపై ఫిర్యాదు చేయండి. కఠిన చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి రోగులకు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆసుపత్రిలో ప్రసవాల విభాగం సహా పలు వార్డుల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న ఆహార నాణ్యతపై ఆరా తీశారు. మందుల లోటు ఏమైనా ఉందా అంటూ నర్సులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేస్తూ పారిశుధ్య సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆసుపత్రిలోని వ్యర్థాలను క్రమబద్ధీకరించే ఎస్‌టీపీ, లాండ్రీల నిర్వహణను ఆమె పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎం పీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి ఉన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణలో ప్రదర్శించిన ఆట వస్తువులు, బోధనా ఉపకరణాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

కరప: శిక్షణలో నేర్చుకున్న బోధనా మెళకువలతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు చదువు పట్ల మక్కువపెంచాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ అన్నారు. వేళంగిలోని మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ ఆరు రోజుల శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆట, పాటలతో, ఉపకరణాలతో విద్యా బోధన చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పట్ల పిల్లల్లో ఆసక్తి కల్పించాలన్నారు. రిసోర్స్‌పర్సన్లు వై.శ్రీనివాస్, ఎస్.విష్ణు అంగన్‌వాడీలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఇచ్చే పోషకాహారం, విద్యాబోధనకు ఉపయోగించే ఆటవస్తువులు, ఇతర ఉపకరణాలను ప్రదర్శించారు. ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి, సూపర్‌వైజర్లు కె.విజయలక్ష్మి, కె.అన్నపూర్ణ, సీఆర్పీలు పి.సత్యనారాయణ, పలక రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘ఆదిత్య’ వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

బాలాజీచెరువు: స్థానిక జగన్నాథపురం ఆదిత్య శాఖ పాఠశాల 35వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ వారణాసి వీరరాఘవులు హాజరై ఆదిత్యలో అభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండటానికిగల కారణం ప్రాథమిక స్థాయి నుంచి గట్టి పునాదులు ఉండటమేనని, అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో విజేతలుగా నిలవడం ఒక కారణమన్నారు. జీజీహెచ్ జనరల్ సర్జన్ డాక్టర్ ఎస్.జయలక్ష్మి హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు పర్యావరణాన్ని సంరక్షించడం, సామాజిక సేవలో ఉండటం సంతోషమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రధానోపాధ్యాయిని సుప్రజారాణి, ఉప ప్రధానోపాధ్యాయిని విద్యారాజేష్,పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి అలజడి

- జార్ఖండ్ వాసిగా గుర్తింపు
- అడ్డుకునేందుకు యత్నించిన ఇద్దరిపై దాడి
- పట్టుకుని దేహశుద్ధి చేసిన స్థానికులు


ఇంట్లోకి చొరబడిన వ్యక్తిని కట్టేసిన స్థానికులు

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం గ్రామస్తులు సోమవారం అర్ధరాత్రి కలవరపాటుకు గురయ్యారు. గ్రామంలోని ప్రధాన రహదారిలో యూనియన్ బ్యాంక్ వద్ద ఒక ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి చొరబడ్డాడు. అర్ధరాత్రి పూట ఆపై హిందీ భాష మాట్లాడే వ్యక్తి కావడంతో ఇంట్లోని వారు భయపడి కేకలు వేశారు. వెంటనే ఇరుగుపొరుగుతో పాటు గ్రామస్తులు అక్కడకు గుమిగూడారు. స్థానికులు అతడిని పట్టుకునే ప్రయత్నం చేయగా పళ్లతో కరచి ఇద్దరిని గాయపరిచాడు. అతడి ప్రతిఘటన చూసిన గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. కాళ్లు, చేతులు కట్టి పోలీసులకు సమాచారమిచ్చారు. దీనిపై ఇంద్రపాలెం ఎస్సై వీరబాబును వివరణ కోరగా ఇంద్రపాలెంలో అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడిన వ్యక్తి జార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామని, అతడికి మతి స్థితిమితం లేదన్నారు. అంతకు ముందుకు రోజు తూరంగిలోనూ ఇలా ప్రవర్తించాడన్నారు. అతడిపై నిఘా ఉంచామన్నారు.

లింగోద్భవానికి సర్వం సిద్ధం


విద్యుత్తు దీపాలంకరణలో సామర్లకోట పంచారామ క్షేత్రం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత చాణుక్య కుమార రామ భీమేశ్వరస్వామి దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలో ప్రాచీన పంచారామక్షేత్రాలలో ప్రముఖమైన ఈ ఆలయం కాకినాడకు 14 కిలోమీటర్లు, రాజమండ్రికి 52 కిలో మీటర్ల దూరంలో గోదావరి కాలువ ఆవలి వైపు ఉంది. ఈ క్షేత్రం పూర్వం చాళుక్య భీమవరంగా ప్రసిద్ధి చెందినట్టు ఇక్కడి శిలా శాసనాల ద్వారా తెలుస్తుంది. ఈ క్షేత్రంలోని పరమేశ్వరుడు యోగలింగంగా సాక్షాత్కరిస్తారు. ఇక్కడి లింగాన్ని స్వయంగా కుమరస్వామి ప్రతిష్ఠించడంతో కుమారరామ భీమేశ్వరునిగా పిలుస్తారు. చారిత్రకంగా చూస్తే పిఠాపురంలో లభించిన శాసనం ప్రకారం 9వ శతాబ్ది చివరిలో వేంగి చాళుక్య పాలకుడైన మొదటి చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. దాంతో ఈ ఆలయాన్ని చాళుక్య కుమారరామ భీమేశ్వరాలయంగా పిలుస్తున్నట్లు చెబుతారు. ఇక్కడి దేవేరిని బాలాత్రిపుర సుందరిగా పిలుస్తారు. మంగళవారం మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో క్యూలైన్లు, విద్యుత్ దీపాలంకరణలు చేశారు. బుధవారం రథోత్సవం, మార్చి ఒకటో తేదీ రాత్రి శ్రీపుష్పయోగోత్సవం నిర్వహించనున్నారు.

చైత్ర, వైశాఖ మాసాలలో సూర్యదేవుని సువర్ణ కిరణాలు ఉదయం పూట స్వామివారి పాదాలను, సాయం సంధ్యలో అమ్మవారి పాదాలను తాకేలా ఆలయ నిర్మాణం జరగడం విశేషం. ఈ దేవాలయానికి పడమర దిక్కున ఒక ఏక శిలాస్తంభం ఉంది. దీనిని స్థానికులు కప్ప స్తంభంగా పిలుస్తారు. ఆలయంలో మహాశివరాత్రితో పాటు కార్తిక మాసం ఇతర పర్వదినాలల్లో ప్రత్యేకంగా ఉత్సవాలు జరుగుతాయి.

ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పూర్తి



భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశాం. గోదావరి కాలువ, ఆలయ కోనేరుతో పాటు ఆలయ ముఖ ద్వారం వద్ద జల్లు స్నానాలు చేయడానికి ఏర్పాట్లు చేశాం. క్యూలైన్లతో పాటు గోదావరి కాలువపై మూడో వంతెన మీదుగా భక్తుల రాక పోకలకు సదుపాయాలు కల్పించాం. కెనాల్ రోడ్డు నుంచి ఆలయం వరకు లైటింగ్ ఏర్పాట్లు చేశాం.

– బళ్ల నీలకంఠం, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

బీచ్ పరిశుభ్రతలో స్వచ్ఛందంగా..


సముద్ర తీరంలో వ్యర్థాలను సేకరించిన కృతజ్ఞ, బాధ్యత సంస్థల సభ్యులు

కాకినాడ క్రైం: సాగరతీరం పరిశుభ్రతలో స్వచ్ఛంద సంస్థలు తమ వంతు బాధ్యతను పోషిస్తున్నాయి. అందులో భాగంగా కలెక్టర్ షణ్మోహన్ సూచనలతో మంగళవారం బీచ్ శుభ్రత చేపట్టాయి. సందర్శకులు విడిచిన వ్యర్థాలను సంచుల్లో పోగుచేసి సముద్ర తీరం నుంచి తరలించారు. కృతజ్ఞ సంస్థ వ్యవస్థాపకుడు ఆతవ రమేష్, బాధ్యత సంస్థ వ్యవస్థాపకుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో 40 మంది సభ్యులు 30 సంచుల్లో వ్యర్థాలను సేకరించారు.

కార్మికులకు ఓటు హక్కు కల్పించాలి

కాకినాడ సిటీ: జిల్లాలోని దుకాణాలు, ఫ్యాక్టరీలు, ఇతర సంస్థల యజమానులు ఈ నెల 27న జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్మికులకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వాలని కాకినాడ జిల్లా ఉపకార్మిక కమిషనర్ బులిరాణి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో ఆదేశించారు. కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాలన్నారు.

సిబ్బందికి యూనిఫాం అందజేత


ఏపీఎస్పీ పెట్రోల్ బంక్‌లో సిబ్బందికి యూనిఫాం అందజేస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ బెటాలియన్ పెట్రోల్ బంక్‌లో సిబ్బందికి కమాండెంట్ ఎం.నాగేంద్రరావు మంగళవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్పీ పెట్రోల్ బంక్‌లో పనిచేసే సిబ్బందికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, ఆర్ఐ రవిశంకర్, ఆర్ఎస్సై శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న డీఈ ఈశ్వరరావు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సైబర్ నేరాలపై మొబైల్ వినియోగదారులకు అవగాహన అవసరమని బీఎస్ఎన్ఎల్ డీఈ జి.ఈశ్వరరావు అన్నారు. కాకినాడలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తరచూ మొబైల్‌కు వస్తున్న లింక్ మెసేజ్‌లను తెరవడం, తెలియని నెంబర్ల నుంచి తరచూ వచ్చే కాల్స్ మాట్లాడడం వల్ల సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉందన్నారు. సబ్ డివిజన్ ఇంజినీర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ టారిఫ్‌ల విషయంలో మిగతా నెట్‌వర్కులతో పోలిస్తే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువన్నారు. జూనియర్ ఇంజినీర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఫైబర్‌నెట్ ద్వారా ఉచిత వైఫై రోమింగ్ సౌకర్యం బీఎస్ఎన్ఎల్ కల్పిస్తుందన్నారు. ఫైబర్ నెట్ ద్వారా కుటుంబంలో నలుగురు సభ్యులు రిజిస్టర్ చేసుకుంటే ఆ కస్టమర్స్ దేశంలో ఎక్కడైనా ఉచితంగా బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ వైఫై పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఊబకాయం నివారణ

బోట్‌క్లబ్: పౌష్టికాహారం తీసుకుంటే ఊబకాయాన్ని నివారించవచ్చునని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో లైట్స్ ఆల్ ఈట్‌రైట్ డే సందర్భంగా మహిళలకు ఆకు కూరలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఊబకాయం నివారణపై పదిమంది సభ్యులతో కమిటీ వేయడం మంచి పరిణామమన్నారు. మన శరీరం సక్రమంగా పనిచేయడానికి ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు అందించడం, మనం పనులు చేసుకోవడానికి శక్తిని ఇవ్వడం మంచి పౌష్టికాహారంతోనే సాధ్యమన్నారు. ఆహారం మూడు ప్రధాన ఇంధనాలతో తయారవుతుందని, కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు అవసరమన్నారు. ప్రతీరోజు మనం తీసుకొనే ఆహారంలో కాయకూరలు, ఆకుకూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. వంటనూనెలో కొవ్వుశాతం తక్కువ ఉండే నూనెను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కాకినాడ కన్వీనర్ శ్రీవల్లీ, సభ్యులు సిరాజ్, చిన్న, మహిళలు పాల్గొన్నారు.

మత్స్యకారుడి గల్లంతు

కాకినాడ క్రైం: సముద్రంలో వేటకు వెళ్లి స్థానిక జగన్నాథపురానికి చెందిన మత్స్యకారుడు బొడ్డు రమణ(59) గల్లంతయ్యాడు. ఈ నెల 8న సహ మత్స్యకారులతో వేటకు వెళ్లి, 14 రోజుల తర్వాత తిరుగు పయనమయ్యాడు. శనివారం పడవ యజమాని కాసరాపు పైడిరాజు అతడి భార్య బొడ్డు లక్ష్మికి ఫోన్ చేసి, రమణ కాకినాడ కుంభాభిషేకం వద్ద పడవ నుంచి సముద్రంలో జారిపడ్డాడని చెప్పాడు. అప్పటి నుంచి గాలించినా ప్రయోజనం లేకపోయిందని లక్ష్మి మంగళవారం కాకినాడ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది.